ప్రజాశక్తి
బుధవారం 25 అక్టోబరు 2023



నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు

ప్రజాశక్తి - టెక్కలి

దసరా సెలవులు ముగియడంతో ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలలు బుధవారం నుంచి తెరుచుకోనున్నాయి. విద్యాశాఖ క్యాలండర్ ప్రకారం ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. ముందుగా 23న దసరా అని భావించిన ప్రభుత్వం 25వ తేదీ నుంచి పాఠశాలలు తెరిచేందుకు నిర్ణయించింది. 24వ తేదీన కూడా దసరా సెలవును పొడిగించడంతో, పాఠశాలల ప్రారంభం తేదీని ఒక రోజు పొడిగిస్తారని భావించారు. ప్రభుత్వం సెలవును పొడిగించకపోవడంతో, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బుధవారం నుంచే పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి.

వ్యూహం

శ్రీకాకుళం ఎంపీ సీటును ఈసారి ఎలాగైనా తన ఖాతాలో వేసుకోవాలని వైసిపి అధిష్టానం గట్టి పట్టుదలగా ఉంది. అందుకు ఇప్పట్నుంచే వ్యూహాలు రచిస్తోంది. బలమైన అభ్యర్థి కోసం అన్వేషణ మొదలుపెట్టింది. టిడిపితో కుమ్మక్కు రాజకీయాలు చేయడం వల్లే 2019లో ఎన్నికల్లో సీటును కోల్పోయామని పార్టీ గట్టిగా విశ్వసిస్తోంది. ఈసారి అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. ముల్లును ముల్లుతోనే తీయాలనే సూత్రాన్ని అమలు చేయాలని చూస్తోంది. వెలమ సామాజిక తరగతి అభ్యర్థిపై అదే తరగతికి చెందిన బలమైన నేతను బరిలో దింపాలని భావిస్తోంది. వచ్చే ఎన్నికల్లో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును రంగంలోకి దించాలని యోచిస్తున్నట్లు తెలిసింది.



- ఎంపీ సీటుపై వైసిపి గురి
- టిడిపితో కుమ్మక్కు రాజకీయాలపై దృష్టిసారించిన అధిష్టానం
- ధర్మానను బరిలో దింపాలని భావిస్తోన్న నాయకత్వం
- గెలిస్తే వైసిపి ఖాతాలో ఎంపీ సీటు
- ఓడితే ధర్మానకు రాజకీయంగా నష్టం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పది అసెంబ్లీ సీట్లకు గానూ వైసిపి ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుంది. శ్రీకాకుళం పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఐదు స్థానాల్లో వైసిపి అభ్యర్థులే విజయం సాధించారు. ఎంపీ సీటు మాత్రం టిడిపి ఖాతాలో పడింది. ఐదుగురు ఎమ్మెల్యేలు గెలిచినా, ఎంపీ సీటు కోల్పోవడాన్ని పార్టీ అధిష్టానం జీర్ణించుకోలేకపోయింది. వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజుల తర్వాత కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసిన సందర్భంలో ఐదుగురు ఎమ్మెల్యేలు గెలిచినా, ఎంపి సీటు ఓడిపోతామా అని ప్రశ్నించడం ద్వారా ఎన్నికల్లో ఏం జరిగిందో తమకు సమాచారం ఉన్నట్లు ముఖ్యమంత్రి మాటల్లో అందరికీ అర్థమైంది. వైసిపి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూసిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సైతం ఎన్నికల్లో ఇక్కడ జరిగిన వెన్నుపోటు రాజకీయాలను ముఖ్యమంత్రికి అప్పటికే వివరించడంతో, అధిష్టానానికి జిల్లాలోని పరిస్థితులు అర్థమయ్యాయి. ఈసారి అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కుమ్మక్కు రాజకీయాలకు చెక్ చెప్పేందుకేనా?

2019 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం ఎంపీ సీటును అతికొద్ది తేడాతో వైసిపి కోల్పోయింది. టిడిపి అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు 5,34,544 ఓట్లు రాగా, వైసిపి నుంచి పోటీ చేసిన దువ్వాడ శ్రీనివాస్‌కు 5,27,891 ఓట్లు వచ్చాయి. 6,653 ఓట్ల తేడాతో టిడిపి గట్టెక్కింది. ఓట్ల శాతం పరంగా చూస్తే 0.57 శాతమే ఉంది. ఎంపీ రామ్మోహన్ నాయుడుకి శ్రీకాకుళం, పలాస నియోజకవర్గాల నుంచి భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు అప్పట్లోనే వైసిపి అధిష్టానం గుర్తించింది. ఎంపీ రామ్మోహన్ నాయుడికి వెలమ సామాజిక తరగతికి చెందిన వైసిపి జిల్లా ముఖ్య నేతలు లోపాయికారిగా మద్దతు పలికినట్లు అధిష్టానానికి ఫిర్యాదులు సైతం వెళ్లాయి. వైసిపి నేతలు కుమ్మక్కు విషయాన్ని గుర్తించిన అధిష్టానం వాటికి చెక్ చెప్పాలని నిర్ణయించినట్లు తెలిసింది. అందులో భాగంగానే ధర్మానను రంగంలోకి దించాలని యోచిస్తునట్లు సమాచారం.

ధర్మానతో పోటీ చేయించడం వ్యూహాత్మకమేనా?

వచ్చే ఎన్నికల్లో ఎంపీ సీటు గెలిస్తే పార్టీకి లాభం లేకుంటే ధర్మానకే నష్టం కలిగేలా అధిష్టానం వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. ఎంపీ రామ్మోహన్ నాయుడుకు వెలమ సామాజిక తరగతితో పాటు కళింగ సామాజిక తరగతికి చెందిన ఓట్లు భారీగానే పడుతున్నాయి. ఎన్నికల సమయంలో వైసిపికి చెందిన వెలమ సామాజిక తరగతి కొందరు నాయకులు లోపాయికారిగా మద్దతు పలుకుతున్నారు. కేంద్ర మాజీ మంత్రి కీ.శే కింజరాపు ఎర్రన్నాయుడు పోటీ చేసిన నాటి నుంచి ఈ తంతు కొనసాగుతోంది. ధర్మానను ఎంపీగా పోటీ చేయిస్తే, వైసిపికి చెందిన వెలమ సామాజిక తరగతి ఓట్లు తనకే పడేలా చేసుకుంటారని వైసిపి భావిస్తోంది. తద్వారా ఓట్లు చీలి ఎంపీ సీటు వైసిపికి దక్కుతుందని అధిష్టానం భావిస్తోంది. ఎంపీగా ఓడితే రాజకీయంగా ధర్మానే నష్టపోతారనే వ్యూహంతో ముందుకు వెళ్తునట్లు తెలుస్తోంది.

ఎంపీ సీటుపై ధర్మాన అయిష్టత

ఎంపీ సీటుపై ధర్మాన అయిష్టత వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాజకీయాల్లో చాలా ఏళ్లుగా పనిచేస్తున్నానని, ఇక పోటీ చేయలేనని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వద్ద ఇటీవల తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈసారి ఎన్నికలకు పోటీ చేయాలని సిఎం సూచించినట్లు గతంలోనే వార్తలు వచ్చాయి. ఎమ్మెల్యే సీటును తన కుమారుడు రామ్‌మనోహర్ నాయుడికి ఇవ్వాలని ఆయన కోరారు. పార్టీ అధిష్టానం మాత్రం ఏ మాటా ఇవ్వలేదని తెలుస్తోంది. అధిష్టానం మాట ఎలా ఉన్నా, శ్రీకాకుళం అసెంబ్లీకి వైసిపి తరుపున పోటీకి ధర్మాన తర్వాత ఆయన కుమారుడు రామ్‌మనోహర్ నాయుడు తప్ప వేరే ప్రత్యామ్నాయమే లేదని అనుచరులు చెప్తున్నారు. ధర్మాన వరకు గెలుపు అవకాశాలు అయితే ఉంటాయి గానీ రామ్‌మనోహర్ నాయుడుకు మాత్రం చెప్పలేమని నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు అంటున్నారు.

యువనేతగా చెప్పుకుంటున్న రామ్ మనోహర్ నాయుడుకి శ్రీకాకుళం నియోజకవర్గానికి సంబంధించి నగరానికి చెందిన నాయకులతో సంబంధాలు కొంతవరకు బాగానే ఉన్నా శ్రీకాకుళం రూరల్ మండలం, గార మండల నాయకులతో సత్సంబంధాలు లేవని తెలుస్తోంది. శ్రీకాకుళం అసెంబ్లీ సీటుకు వైసిపి తరుపున కొత్త అభ్యర్థిని రంగంలోకి దించినా, ధర్మాన అనుయాయులు గెలుపు కోసం పనిచేస్తారనేది సందేహమే. ఇది టిడిపికి మేలు చేసే అంశమే అవుతుందని కొందరు నాయకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ధర్మానతో ఎంపీ సీటుకు పోటీ చేయించడం అసలుకే ఎసరు పెట్టేలా ఉందని పలువురు వైసిపి నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.



పాతపట్నం నీలమణి అమ్మవారి ఆలయం వద్ద వాహనాలకు చేస్తున్న పూజలు

ఆనందోత్సాహాలతో దసరా



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు సందడిగా సాగాయి. చివరి రోజు మంగళవారం దసరా పండగను ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి ఉల్లాసంగా గడిపారు. రకరకాల వంటకాలు చేసి ఇంటిల్లిపాదీ ఆరగించారు. వాహనాలకు, యంత్రాలకు పూజలు చేశారు. మండపాలు, ఆలయాలను సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్కడి సంప్రదాయాల ప్రకారం కొమ్ములు వేయడం, ఇతరత్రా కార్యక్రమాలు చేపట్టారు.

పోలియో నిర్మూలనే ధ్యేయం



శ్రీకాకుళం అర్బన్ : పోలియో నిర్మూలనే ధ్యేయమని రోటరీ క్లబ్ పోలియో నివారణ కమిటీ చైర్మన్ ఎం.ఆర్.కె దాస్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యాన పోలియోపై అవగాహన విరాళాల సేకరణను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ 1979 సంవత్సరంలో పోలియో నిర్మూలనకు పోరాటం ప్రారంభించిందన్నారు. ఇప్పటివరకు 99.9 శాతం పోలియోని నిర్మూలించామని చెప్పారు. ఇంకా కొన్ని దేశాల్లో కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. పోలియో నిర్మూలనకు ఇచ్చే ప్రతి రూపాయికి బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్ రూ.రెండు జత చేసి పోలియో నిధికి అందిస్తుందని వివరించారు. అందరూ విరాళాల రూపంలో మరింత ఆర్థిక సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గీతా శ్రీకాంత్, కార్యదర్శి ఎ.అనంతరావు, సెక్రటరీ డి.శివశంకర్, సంయుక్త కార్యదర్శి బరాటం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

అన్ని వర్గాలకు రాజ్యాధికారం లక్ష్యంగా యాత్ర

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

అన్ని వర్గాలకు రాజ్యాధికారం లక్ష్యంగా సామాజిక సాధికారిత బస్సు యాత్ర చేపడుతున్నట్లు బస్సు యాత్ర పరిశీలకులు ఎమ్మెల్సీ ఎల్.అప్పిరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సామాజిక సాధికారిత బస్సు యాత్ర సన్నాహక సమావేశాన్ని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం అన్ని వర్గాలకు అందించాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అన్ని ప్రధాన పదవులు వెనుకబడిన తరగతుల వారికి కేటాయించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈనెల 26న మధ్యాహ్నం మూడు గంటలకు ఇచ్ఛాపురంలో ప్రారంభమవుతుందని తెలిపారు. బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. యాత్రలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్సు యాత్ర కోసం తరలివచ్చే ప్రజానీకానికి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ లక్ష్మణమూర్తి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, కళింగ, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్లు పేరాడ తిలక్, దుక్క లోకేశ్వరరెడ్డి, సీడాప్ చైర్మన్ శాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల దివ్యభారతి, లాభాల స్వర్ణమణి తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రలో భాగస్వామ్యం కావాలి

ఈనెల 26వ తేదీన ఇచ్ఛాపురంలో ప్రారంభం కానున్న సామాజిక సాధికారిత బస్సు యాత్రలో మహిళా సంఘాలు భాగస్వామ్యం కావాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. మండలంలోని లొద్దపుట్టిలో స్వయంశక్తి సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మహిళలు అండగా నిలవాలన్నారు. మహిళల సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. వెలుగు ఎపిఎం ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించం

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ రణస్థలం మండలం నారువకు చెందిన టిడిపి అభిమానులు శ్రీకాకుళం నుంచి కుప్పంకు చేపట్టిన సైకిల్‌యాత్రను మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు అడ్డుకొని బెదిరించడాన్ని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తప్పుపట్టారు. ఉత్తరాంధ్ర పేరుతో అవమానించి, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని హెచ్చరించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాంతం పేరుతో దూషించడం, నడిరోడ్డు పైనే బట్టలు విప్పించడం అమానుషమన్నారు. మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు చేసిన ఈ దాడి, ప్రజాస్వామ్య విలువలకు పాతర వేసే విధంగా ఉందని ఆక్షేపించారు. ప్రాంతాలు, సంస్కృతులు, యాస వేరైనా అందరిదీ తెలుగు భాషే అని అన్నారు. ఆత్మీయత, గౌరవ మర్యాదల్లో మన రాష్ట్రానిది ఎప్పుడూ అగ్రస్థానమేనని గుర్తుచేశారు. ప్రాంతాల పేరుతో వైషమ్యాలు సృష్టిస్తున్న వైసిపి మంత్రులు, నాయకులు.. విశాఖలో ఉత్తరాంధ్రకు చెందిన ప్రజలు కూడా ఇదేవిధంగా ప్రవర్తిస్తే ఏం సమాధానం చెప్తారన్నారు. జిల్లాకు చెందిన వ్యక్తులను ప్రాంతం పేరుతో అవమానిస్తే జిల్లాకు చెందిన మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా బాధిత టిడిపి నాయకులకు క్షమాపణలు చెప్పాలని, వారిపై అమానుషంగా ప్రవర్తించిన బాధ్యులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సైకో ప్రభుత్వాన్ని సాగనంపాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస, కవిటి, శ్రీకాకుళం అర్బన్, బూర్జ

రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్న సైకో జగన్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని తెలుగుదేశం పార్టీ జిల్లా కూన రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. సరుబుజ్జిలి మండలంలోని పాలవలసలో బాబుతో నేను, జగనాసుర దహనం కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలు, పన్నుల బాదుడు, నియంతత్వ పోకడలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు జగనాసుర దహనం కార్యక్రమం చేపట్టకూడదని చెప్పడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయినా రవికుమార్ టిడిపి శ్రేణులతో కలిసి సైకో పోవాలి పత్రాలను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరికీ ఉంటుందన్నారు. ప్రశ్నించే గొంతులను ప్రభుత్వం పోలీసులతో అణచివేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, ఎ.రాంబాబు, లావేటి పూర్ణారావు, టి.వి రమణ, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, దేశ చరిత్రలోనే ఇటువంటి నియంత పాలన ఎప్పుడూ చూడలేదని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలో జగనాసుర దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకో పోవాలి, సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు దహనం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొందల కృష్ణారావు, బెందాళం రమేష్, పుల్లట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని అరసవల్లిలో జగనాసుర దహనం కార్యక్రమం చేపట్టారు. సైకో పోవాలి పోస్టర్లను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి నాయకులు సింతు సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, ప్రధాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

బూర్జలో...

బూర్జ మండలంలోని గిరడపేటలో జగనాసుర దహనం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి బిసి సెల్ మండల అధ్యక్షులు మామిడి దుర్గారావు మాట్లాడుతూ సైకో పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని విమర్శించారు. రాజకీయ కక్షలతో ప్రశ్నించే వారిని, ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో డి.వెంకునాయుడు, బాలకృష్ణ, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కవిటి : పోస్టర్లను దహనం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు



ఆమదాలవలస : పోస్టర్లను దహనం చేస్తున్న రవికుమార్



బూర్జ : పోస్టర్‌ను దహనం చేస్తున్న నాయకులు



ఆయుధ పూజ చేస్తున్న ఎస్‌పి రాధిక దంపతులు

ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో ఆయుధపూజ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఎచ్చెర్లలోని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో దసరాను పురస్కరించుకుని మంగళవారం ఆయుధపూజ నిర్వహించారు. జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు ఎస్‌పి జి.ఆర్ రాధిక దంపతులు పూజా కార్యక్రమాలు చేశారు. పోలీసు ఆయుధాగారం, మోటారు ట్రాన్స్‌పోర్టు విభాగాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీసులకు తమ దైనందిన విధులు, సేవల్లో విజయాలు చేకూరాలన్నారు.

సమాజంలో పోలీసు విధులు కీలకంగా మారాయని తెలిపారు. పండగ అయినా, బందోబస్తు అయినా పోలీసులు మనస్ఫూర్తిగా విధులు నిర్వహిస్తారని కొనియాడారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ ఎం.నాగమణికంఠ, అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వర్, ఆర్‌ఐ ఉమామహేశ్వరరావు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దారులు మూసుకుపోతున్నాయి

- జరగని జంగిల్ క్లియరెన్స్
- ప్రమాదకరంగా మలుపులు
- ప్రయాణికులకు అవస్థలు

ప్రజాశక్తి - కవిటి

కవిటి మండలంలో జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తిగా చేపట్టకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి రహదారులు మూసుకుపోతున్నాయి. చాలా గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా ఇవి పేరుకుపోయి మలుపుల వద్ద ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శిలగాం గ్రామం నుంచి కవిటి వచ్చే రహదారి, బిజిపుట్టుగ నుంచి సహలాలపుట్టుగ వెళ్ళే రహదారి, కొజ్జిరి నుంచి రాజపురం మీదుగా కవిటి వచ్చే మార్గం, ప్రగడపుట్టుగ నుంచి కపాసుకుద్ది, నెలవంక వెళ్ళే రహదారి, కవిటి నుంచి ఈదుపురం వెళ్ళే రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయి రోడ్డు పైకే వచ్చేస్తున్నాయి. దీంతో మలుపుల వద్ద, సాయంత్రం, రాత్రి వేళల్లో ఈ ప్రాంతాల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేస్తున్నామని, ఈ రహదారుల్లో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తమ పిల్లలు సైకిల్‌పై పాఠశాలలకు వెళ్లి తిరిగి వచ్చే వరకు తమ దృష్టంతా అటువైపే ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వాహన చోదకులు, విద్యార్థులు, ప్రజల సౌలభ్యం కోసం వెంటనే జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని కోరుతున్నారు.



శిలగాం నుంచి కవిటి వచ్చే రోడ్డు పక్కనే గోడ కట్టినట్టు పెరిగిన మొక్కలు

మనుగడ కోసమే టిడిపి, జనసేన పొత్తు

ఆమదాలవలస : టిడిపి, జనసేన పార్టీలు వాటి మనుగడ కోసమే పొత్తు ప్రకటించుకున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ విమర్శించారు. ప్రజా సంక్షేమం గురించి ఆ పార్టీలకు నిబద్ధత, భావసారూప్యత లేదన్నారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో గల జగనన్న ప్రజా సేవ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో టిడిపి, జనసేన పార్టీలు కనుమరుగు కాక తప్పదన్నారు. ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే ఓట్లు పడతాయి గానీ పొత్తుల వల్ల ఓట్లు పడవన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన సైనికుల మనోభావాలకు వ్యతిరేకంగా తన స్వార్థం కోసం చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో పవన్ కళ్యాణ్ జన సైనికుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. అవినీతిపై పోరాడతానని ప్రగల్భాలు పలికిన పవన్ కళ్యాణ్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో నిందితునిగా జైల్లో ఉన్న చంద్రబాబు అడుగులకు మడుగులొత్తుతున్నారని ఎద్దేవా చేశారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

ప్రజాశక్తి- లావేరు

గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని కేశవరాయునిపాలెంలో ఉపాధిహామీ నిధులు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రజలు ఆ గ్రామ పరిధిలోనే వారి సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా ప్రాథమిక వైద్యం అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సాగునీరందించడంలో మంత్రి విఫలం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార శివారు ప్రాంతాలకు సాగునీరు అందించడంలో మత్స్య పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ అప్పలరాజు విఫలమయ్యారని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సూరాడ మోహనరావు అన్నారు. వజ్రపుకొత్తూరులోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వంశధార కాలువ కింద సాగయ్యే గ్రామాల్లో పంట పూర్తిగా ఎండిపోతే పరిస్థితి కనిపిస్తుందని అన్నారు. దీనిపై అధికారులు, నియోజకవర్గ నాయకులు స్పందించడం సరికాదన్నారు. సాగునీరు కోసం ప్రశ్నిస్తుంటే... రైతులకు అవహేళనగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శివాజీ హయాంలో మండలంలోని శివారు గ్రామాలకు నీరు అందించిన, ఇప్పుడు ఎందుకు అందరం లేదని ప్రశ్నించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు కోసం దీక్ష చేసి రూ. 465 కోట్లు మంజూరు చేయించిన ఘనత గౌతు శివాజీకే దక్కుతుందన్నారు. అభివృద్ధి గాలికి వదిలేసిందన్నారు. అంతంతమాత్రమే సంక్షేమ పథకాలు అందించి... అతిగా ప్రచారం చేసుకుని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు రాజకీయ కక్షతో ఎఫ్‌ఐఆర్ నమోదు కాకుండా అక్రమ కేసులో ఇరికించారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గోరకల వసంతరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పోతనపల్లి సాంబమూర్తి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు శశిభూషణరావు, టిడిపి నాయకులు గోవింద్, పాపారావు, ఉమామహేశ్వరరావు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన అరకభద్ర వంతెన పనులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని అరకభద్ర-కాళిగాం గ్రామాలను అనుసంధానం చేసేందుకు బాహుదా నదిపై వంతెన నిర్మాణ పనులు నత్తనడక నడుస్తోంది. సుమారు 30 గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వంతెన పనులు పూర్తి కాకపోవడంతో రెండు కిలో మీటర్ల దూరానికి సుమారు 24 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. అరకభద్ర వద్ద బద్దెల కిందట అప్పటి ప్రభుత్వం రూ.7.15 కోట్లతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించింది. అనంతరం వచ్చిన ప్రభుత్వం 2022 ఆగస్టు నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించింది. 50 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వేగవంతం కాకపోవడంతో ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే బాహుదా నది దాటి వెళ్లాలి. నదిలోకి వరద నీరు వస్తే పాఠశాలకు వెళ్లలేకపోతున్నారు. నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నత్తనడక సాగుతున్నట్లు తెలుస్తుంది. ఈ ఏడాది జూన్, జులై నెల్లో కొంతమేర చేసి వర్షాలు పేరుతో నిలిపివేశారు. ఒడిశాలో భారీగా వర్షాలు కురిస్తే ఈ ప్రాంతానికి వరద నీరు పోటెత్తుతుంది. నదిలో తక్కువ నీరు ఉండే అరకభద్ర నుంచి కాళిగాం, ఇతర ప్రాంతాలకు విద్యార్థులు, ప్రజలు నడుచుకుని వెళ్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని పంచాయతీరాజ్ జెఇ ధనుంజయరావు వద్ద ప్రస్తావించగా... ప్రస్తుతం 55 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయన్నారు. సాంకేతిక కారణాలతో ప్రస్తుతం పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి వంతెన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అర్ధాంతరంగా నిలిచిన వంతెన పనులు

రూ.లక్షల్లో అద్దెలు.. కొనుగోలుదారుల్లో గుబులు

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో వ్యాపార పరంగా రెండో స్థానంలో ఉన్న పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు వాణిజ్య కళ వచ్చింది. గతంలో స్థానిక చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను చేస్తూ జీవనం గడుపుతుండగా... గోరుచుట్టుపై రోకలి పోటులా పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ పలాస కేంద్రంగా ప్రారంభిస్తున్నారు. దీంతో వారి బతుకులు మసకబారాయి. ఇటీవల పలాస-కాశీబుగ్గలను కలిపే కెటి రోడ్డు విస్తరణ పనులు జరగడంతో షాపులకు గిరాకీ పెరిగింది. ముఖ్య వాణిజ్య డివిజన్ కేంద్రంగా మారడంతో ఉద్దాన, పట్టు, మత్స్యకార, గిరి ప్రాంతాల ప్రజలు ఈ మార్కెట్‌పై ఆధార పడుతుండడంతో కోట్లాది రూపాయలలో లావాదేవీలు జరుగుతుంటాయి. ఇటీవల కెటి రోడ్డును 80 అడుగులకు విస్తరించడంతో పాత షాపుల స్థానంలో కొత్తగా షాపులు నిర్మించిన వాటి యజమానులు లక్షలాది రూపాయలకు అద్దెలకు ఇచ్చి కొనుగోలుదారుల్లో గుబులు రేపుతున్నారు. ఇటీవల కెటి రోడ్డులో నూతనంగా పలు వాణిజ్య వ్యాపార కేంద్రాలు ప్రారంభించింది. ఆయా షాపులకు లక్షలాది రూపాయలు అద్దెల రూపేణ యజమానులు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. విశాఖ కేంద్రంగా వ్యాపారం చేస్తున్న షాపింగ్ మాల్స్ నిర్వాహకుల దృష్టి జంట పట్టణాలపై పడింది. కొంతమంది స్థలాలను తీసుకొని వాటిపై తమ సొంత నిధులతో భవనాలు నిర్మించి నెలనెలకు స్థలానికి సంబంధించి అద్దెలు చెల్లిస్తుండగా... మరికొంతమంది భవనాలు నిర్మించి అద్దెలకు ఇవ్వడం జరుగుతోంది. అదే కోవలో గత నెల ప్రారంభించిన ఓ షాపింగ్ మాల్‌కు నెలకు రూ. 3 లక్షలు అద్దె రూపేణ నిర్వాహకులు చెల్లించేందుకు ఒడంబడిక కుదుర్చుకున్నట్లు భోగట్టా. అలాగే మరో షాపింగ్ మాల్‌కు నెలకు రూ.లక్ష ఇలా అద్దెల వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సంవత్సరానికి అద్దెల రూపంలో లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్న యజమానులు ఆదాయ పన్నులు చెల్లిస్తున్నారో లేదో? తెలియడం లేదు. పలాసకు చెందిన ఒక మాజీ ప్రజాప్రతినిధికి కెటి రోడ్డులో సుమారు 20 షాపులు ఉన్నట్లు పలువురు చెప్తున్నారు. ఆయనకు అద్దెల రూపంలోనే నెలకు రూ.20 లక్షలు ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే లక్షలాది రూపాయలు అద్దెలు చెల్లిస్తున్నా షాపింగ్ మాల్స్‌కు తమ వ్యాపార అభివృద్ధికి కొనుగోలుదారులే మూలస్తంభమని భావిస్తున్నారు. సరసమైన ధరలకు వస్తువులు అందజేస్తున్నామని ప్రకటిస్తున్నా లక్షలాది రూపాయల అద్దెలు మాత్రం కొనుగోలుదారుల నుంచే వసూలు చేస్తున్నారు. అద్దెల విషయమై మున్సిపాలిటీ అధికారులు స్పందించి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కొంతమంది కోరుతున్నారు.



అద్దె భవనాల్లో ఉన్న షాపులు

అపరిచిత కాల్స్‌పై అప్రమత్తం

కవిటి: అపరిచిత ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.రాము సూచించారు. ఇటీవల తమకు అపరిచితుల నుంచి ఫోన్స్‌కాల్స్ ఎక్కువగా వస్తున్నాయని, మీరు లోన్ తీసుకున్నారు... వెంటనే చెల్లించాలని మాట్లాడుతున్నారని కుసుంపురానికి చెందిన జన సైనికులు ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి నాయకులతో కలిసి మంగళవారం ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్ఐ మాట్లాడుతూ ఇటువంటి కాల్స్‌కు ఎవరూ స్పందించవద్దని, స్పందిస్తే మన వ్యక్తిగత సమాచారం చోరీ జరిగే ప్రమాదముందని అన్నారు. ఇటువంటి ఫోన్ కాల్స్ వేస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెన్షనర్లకు తీరని అన్యాయం

ఆమదాలవలస : పెన్షనర్లకు న్యాయంగా చెల్లించాల్సిన డిఆర్ బకాయిలను వేలాది రూపాయలు చెల్లించకుండా గత కొంతకాలంగా వాయిదాలు వేస్తూ నష్టం కలిగించడం భావ్యం కాదని పెన్షనర్ల సంఘం నాయకుడు బొడ్డేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2018 జులై నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు 185 నెలల డిఆర్ ఏరియర్స్ ఎప్పుడు చెల్లిస్తారో? ప్రకటించాలని కోరారు. వృద్ధాప్యంలో మగ్గుతున్న పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు సైతం సకాలంలో చెల్లించకపోతే ఎలా జీవించాలని వాపోయారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా... మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కటక్ జిల్లా ఇచ్ఛాపూర్‌కు చెందిన నిరంజన్ మహంతి (40), క్లీనర్ నరసయ్యలు లారీ నిలుపుదల చేసి టైర్లను పరిశీలిస్తున్నారు. అదే రహదారిలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఇద్దరినీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మహంతి అక్కడికక్కడే మృతి చెందారు. నరసయ్య గాయపడ్డాడు. వెంటనే స్థానికులు హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య



హేమంత్ (ఫైల్)

లావేరు : చేతికంది వచ్చిన కుమారుడు, కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటాడు అనుకున్న సమయానికి ప్రేమ వ్యవహారం విఫలం కావడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ కుటుంబంలో పండుగ పూట తీవ్ర విషాదం నెలకొంది. మండలంలోని పెద్దకొత్తపల్లి పంచాయతీ కొత్తూరుపేటకు చెందిన సోడిశెట్టి హేమంత్ (33) పురుగులు మందు తాగి చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని కొన్నాళ్లుగా ప్రేమించాడు. ఆ యువతి కుటుంబ సభ్యులను తన తమ్ముడుకి ఇచ్చి వివాహం చేయాలని మృతుడు సోదరుడు సత్యనారాయణ వెళ్లి అడిగారు. ఉద్యోగం ఉన్న వారికి ఇస్తాం... మీ తమ్ముడుకి ఇవ్వమని చెప్పారు. దీంతో హేమంత్ మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం గ్రామానికి సమీపంలో ఉన్న తోటలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకుని గ్రామస్తులు గమనించి 108 వాహనంలో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రమేష్ (ఫైల్)

ఇచ్ఛాపురం : పట్టణంలోని సురంగిరాజా క్రీడా మైదానం వద్ద గ్యారేజ్‌లో వాహనాలకు సర్వీస్ చేస్తుండగా విద్యాదాఘాతానికి గురై మెకానిక్ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షరాబుల వీధికి చెందిన బెహరా రమేష్ (30) బైక్ గ్యారేజ్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం కస్టమర్ ద్విచక్ర వాహనం వాటర్ సర్వీసింగ్ చేస్తున్నాడు. అప్పటికే స్విచ్ బోర్డుకు తెగి ఉన్న వైర్‌కు తాకడంతో షాక్ గురై ఘటనాస్థలంలోనే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. టౌన్ హెడ్ కానిస్టేబుల్ వి.విశ్వనాథం కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి తల్లిదండ్రులు కృష్ణవేణి, శేఖర్ ఉన్నారు. పండగ పూట విషాదం చోటు చోటుచేసుకోవడంతో వీధిలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

ఆమదాలవలస : మండలం లోని శ్రీనివాసచార్యులపేట పంచాయతీ పరిధిలోని ఈసర్లపేట కూడలి వద్ద కారు ఢీకొని వ్యక్తి గాయాలు పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... సోమవారం మధ్యాహ్నం బూర్జ మండలం అన్నంపేటకు చెందిన ఆచంట ఉమామహేశ్వరరావు తన సొంత గ్రామం నుంచి తన ద్విచక్ర వాహనంతో శ్రీకాకుళం వైపు వెళుతున్నాడు. ఈసర్లపేట కూడలి వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ఉమామహేశ్వరరావు ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ వై.కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోర్టు వాహనం నుంచి మంటలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



టిప్పర్ నుంచి వస్తున్న మంటలు

టెక్కలి పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం పోర్టు రాయి రవాణా చేస్తున్న టిప్పర్ నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. టెక్కలి పాతజాతీయ రహదారిపై వెళ్తున్న టిప్పర్ నుంచి ఒక్కసారిగా పొగలు, మంటలు రావడంతో స్థానికులు, వాహనాదారులు ఆందోళన చెందారు. టిప్పర్ ముందు భాగం నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



పాడైన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

పాడైన పంటలు పరిశీలన

మెళియాపుట్టి : వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దపద్మాపురం, దీనబంధుపురం గ్రామాల్లో నష్టపోయి వరి పంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట దశలో సాగునీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, లలిత కుమారి, దినకర్, వసంత్, భాస్కరరావు, గణపతిరావు, పరమేశ్వర్‌రెడ్డి, దుక్క బాలరాజు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఆర్అండ్‌బి బంగ్లా



శిథిలావస్థలో ఉన్న ఆర్అండ్‌బి బంగ్లా

ప్రజాశక్తి- రణస్థలం

జిల్లా ముఖ ద్వారం రణస్థలం మండల కేంద్రం 16 నంబరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఆర్అండ్‌బి బంగ్లా శిథిలావస్థకు చేరింది. గతంలో ఇక్కడ జిల్లా సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ బంగ్లాలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకొనేవారు. ఈ రహదారి బంగ్లాను వదిలేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. గతంలో ఈ బంగ్లాలో ఒక అటెండర్, వాచ్‌మేన్ పనిచేసే సిబ్బంది ఉండే వారు. వారు విశ్రాంత అయిన తరువాత ఆ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో బంగ్లా ఆలనాపాలనా చూసేవారు కరువయ్యారు. దీంతో ఈ బంగ్లా శిథిలావస్థకు చేరుకుంది. పూర్తిగా విడిచిపెట్టడంతో విష సర్పాలకు నిలయంగా మారింది. అధికారులు స్పందించి ఈ భవనాన్ని పూర్తిగా తొలగించి నూతనంగా నిర్మించి వినియోగంలోకి తీసుకువస్తే ప్రయోజనంగా ఉంటుందని పలువురు అంటున్నారు.

సంక్షిప్త వార్తలు

జనసేనలోకి 'సలాన'



మాట్లాడుతున్న మోహనరావు


మెళియాపుట్టి : జనసేన పార్టీలోకి చేరనున్న మాజీ మండల పరిషత్ అధ్యక్షులు సలాన మోహనరావు తెలిపారు. తన నివాసం వసుంధరలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కొన్నాళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటూ జనసేన పార్టీలోకి ఆకర్షితులై పార్టీలోకి చేరనున్నట్లు చెప్పారు. త్వరలోనే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో చేరనున్నట్లు తెలిపారు. సలాన నిర్ణయంతో జనసేన పార్టీ మరింత బలపడుతుందని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

సామాజిక కార్యక్రమాలతోనే ఆనందం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సామాజిక కార్యక్రమాలతోనే ఆనందం కలుగుతుందని కృతిక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని తొగరాంకు సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడు, ఆయన మామ బగాది కొండలరావు జ్ఞాపకార్థం పట్టణంలోని లెప్రసీ కాలనీ వద్ద 30 మంది వికలాంగులకు, వృద్ధులకు సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్ముందు మరిన్ని ఆర్థిక, సామాజిక కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి అశోక్, దుర్గ, హరీష్, తేజ, హేమంత్, రవి పాల్గొన్నారు.

వైసిపి మండల అధికార ప్రతినిధిగా దుర్యోధనరావు



వెంకటరావు చిట్టి, సాయికృష్ణతో దుర్యోధనరావు

పలాస : మండలంలోని వైసిపి అధికార ప్రతినిధిగా చినంచల ఎంపిటిసి బమ్మిడి దుర్యోధనరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టిబాబు) తెలిపారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశానుసారం పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకుందని అన్నారు. ఈ సందర్భంగా దుర్యోధన మాట్లాడుతూ మంత్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కోసం కృషి చేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా కలసి పనిచేస్తామని చెప్పారు. దుర్యోధన ఎంపికపై ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ అభినందనలు తెలిపారు.

దొంకలపర్తలో అన్నదానం

బూర్జ: మండలంలోని దొంకలపర్తలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారి శరన్నరాత్రులు, ఉత్సవాలు ముగింపు సందర్భంగా అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు ఆలూరి గుర్రయ్య తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన 1500 మందికి యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలరాజు శ్రీధర్, చిన్నమ్మ నాయుడు, అప్పలనాయుడు, శ్రీను, ధనుంజయ పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ఇచ్ఛాపురం : రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005లో పదో తరగతి చదువుకున్న కమలాయిపుట్టుగకు తోటి స్నేహితుడు దేవాందేర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు మృతుడి కుటుంబానికి రూ.19,500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సముద్రతీరంలో మౌలిక సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని సముద్ర తీర ప్రాంతాలో ఆరు పంచాయతీల్లో 18 గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంతాకుల కార్తీక మాసంలో జిల్లాలో నలుమూలల నుంచి యాత్రికులు వన భోజనాలకు, సముద్ర స్నానాలకు వేలు సంఖ్యలో వస్తుంటారు. అయితే ఇక్కడ సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రేవు అంపలాం, కొత్తరేవు, డి.ఎల్.పురం, గుల్లవానిపేట, జోగంపేట, గుప్పిడిపేట పంచాయతీల్లో సముద్ర తీరం ఉంది. ఇందులో అన్ని పంచాయతీల్లో సముద్ర తీరం ఉన్నా రాజారాంపురం, గుల్లవానిపేట గ్రామాలు సముద్ర స్నానాలకు అనుకూలంగా ఉన్న రేవులు ఉన్నాయి. ఈ గ్రామాలకు ఏటా వేల సంఖ్యలో యాత్రికులు తరలివస్తుంటారు. ఈ తీరంలో ఎక్కువ విశాలమైన జీడి తోటలు, సముద్రానికి దగ్గరగా ఉండడంతో వనభోజనాలు చేసుకొని తదుపరి సముద్ర స్నానాల చేసుకొని ఆనందంగా ఇంటిల్లిపాదీ గడిపి వెళుతుంటారు. అయితే ఇంత అహ్లాదకరమైన సముద్ర తీర గ్రామాల్లో ఎటువంటి మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో రాజారాంపురానికి టూర్తి, కొమర యర్రయ్య, తాతారావు, పోలీసు, లక్ష్మీపతి ఆవేదన వ్యక్తం చేశారు. కార్తీక మాసంలో మేము, యూత్ కలసి సొంత పెట్టుబడి పెట్టి యాత్రికలకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గుల్లవానిపేట సర్పంచ్ వారాది మోహన్ సొంతంగా రూ.25 వేలు ఖర్చు చేసి సముద్ర తీరంలో బెంచీలు వేశారు.



రాజారాంపురం సముద్ర తీరం



ఎంపీ కుమార్తెతో ముచ్చటిస్తున్న అచ్చెన్న

నిమ్మాడలో గ్రామదేవత ఉత్సవాలు

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడలో గ్రామ దేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా మంగళ వారం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, సతీమణి విజయ మాధవి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్ సతీసమ్మేతంగా పాల్గొన్నారు. కింజరాపు కుటుంబ సభ్యులందరూ పాల్గొని సందడిగా గడిపారు. ఎంపీ కుమార్తెతో అచ్చెన్న కొద్దిసేపు ఊసులాడుకున్నారు. ఏటా దసరా రోజున గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా నిమ్మాడ కూడలిలో ఉన్న దుర్గాదేవిని అచ్చెన్న సతీసమ్మేతనంగా దర్శించుకున్నారు.

నిర్మించారు... వదిలేశారు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి మండలానికి సంబంధించి పౌర సరఫరాలశాఖ సరుకుల గోదాం భవనం నిర్మించారు. కానీ, ఈ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన నిర్మాణం భవనాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యాన మండలానికి గోదాం నిర్మాణం జరిగి ఏడాది కావాస్తోంది. అప్పటి నుంచి ప్రారంభించకపోవడంతో అద్దె భవనంలోనే నడుస్తుంది. దశాబ్దాల కాలం నుంచి స్థానిక జూనియర్ కళాశాల మైదానం వద్ద ఉన్న డిసిఎంఎస్ భవనంలో పౌర సరఫరాల గిడ్డంగి ఉంది. ఇక్కడ నుంచే టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన చౌక ధరల దుకాణాలకు సరుకులు రవాణా జరుగుతుండేవి. అయితే మండలానికి ఒక పౌర సరఫరాల గిడ్డంగి ఉండాలనే ప్రభుత్వ ఆలోచన మేరకు స్థానిక లచ్చన్నపేట వద్ద ఉన్న కొండ వద్ద భవనాన్ని నిర్మించారు. ఇందుకోసం సుమారు రూ.60 లక్షలు వెచ్చించారు. ఆయితే భవనం నిర్మాణం జరిగి ఏడాది కావస్తున్నా... నేటి వరకు ప్రారంభానికి నోచుకోకపోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న గోదాం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రవాణా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



వృథాగా ఉన్న భవనం

నౌపడలో అపారిశుధ్యం

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో నౌపడ మేజర్ పంచాయతీలో పారిశుధ్యం లోపించింది. కొద్దిరోజులుగా పలు వీధుల్లో అపారిశుధ్యం ఎక్కడికక్కడే దర్శనమిస్తుంది. వీధులు చెత్తాచెదారంతో నిండిపోయాయి. నౌపడలోని బజారు వీధి, మెయిన్ రోడ్డు, వైఎస్ఆర్ కాలనీ, గిన్ని వీధి, కామటి వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దీంతో గ్రామంలో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో విషజ్వరాలు, వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే చెత్తను తొలగించి, పారిశుధ్య పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీనిపై నౌపడ-2 పంచాయతీ కార్యదర్శి ఉమాపతి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు.



బజారువీధిలో పేరుకుపోయిన చెత్త



మందును పిచికారీ చేస్తున్న రైతు

జాగ్రత్త సుమా...

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించడానికి, చీడపీడలు, తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవడానికి రైతులు రసాయన మందులను పిచికారీ చేస్తుంటారు. ఇటువంటి సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. నియోజకవర్గంలో నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో ఎక్కువగా వరి, మొక్కజొన్న, వేరుశెనగ, మిరప, కూరగాయలు తదితర పంటలు సాగు చేస్తుంటారు. ఏటా వంశధార కాలువ కిందతో పాటు వివిధ ఆయకట్ట పరిధిలో ఎక్కువగా వరి వేస్తారు. కోటబొమ్మాళి మండలంలో ఖరీఫు సీజన్‌లో వరి 25 వేల ఎకరాలు, కూరగాయలు 750, వేరుశెనగ 750, ఇతర పంటలు 2500 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ప్రస్తుతం వరి పంటకు దోమ సోకిందని, కూరగాయలకు పురుగు సోకుతుందని ఎక్కువగా మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ పంటలకు రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

సేంద్రీయ విధానం మేలు

పంటల చీడపీడల నివారణకు క్రిమిసంహారక మందులు వినియోగించేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైన మేర మాత్రమే వాడాలి. సేంద్రీయ విధానంలో వ్యవసాయం చేయడం అలవాటు చేసుకుంటే భూమి సారమంతంగా ఉంటుంది. దిగుబడులు కూడా అధికంగా సాధించవచ్చు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో రసాయన మందులు వాడకంలో మెలుకువలు పాటించాలి. రసాయన మందులు వాడేటప్పుడు రంధ్రాలు పడిన యంత్రాలను వాడకపోవడం మంచిది. గాలి వీచే దిశలో మాత్రమే పిచికారీ చేయాలి. వాడిన మందు డబ్బాలను భూమిలో పాతి పెట్టడం, కల్చేయడం మంచింది.

-ఎస్.గోవిందరావు, మండల ఎఒ

నిర్లక్ష్యం చేయొద్దు

పొలాల్లో చీడపీడల నివారణకు రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు ప్రత్యేకమైన దుస్తులు ధరించాలి. తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉన్నా, కళ్లు మంటగా ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ పొన్నాడ గణేష్, ప్రభుతాస్పత్రి, కోటబొమ్మాళి